ప్రజాశక్తి
శనివారం 7 జనవరి 2023
5
శ్రీకాకుళం





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు

- జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 5,600 మంది అభ్యర్థులు
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 8వ తేదీన నిర్వహించే గ్రూప్-1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. ఎపిపిఎస్‌సి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష ఉదయం పది నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలకు జిల్లాలో 19 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. పరీక్షలకు 5,600 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు.

24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున మొత్తం 219 మందిని ఏర్పాటు చేశామన్నారు. లైజన్ అధికారులుగా సీనియర్ జిల్లా అధికారులను నియమించినట్లు తెలిపారు. మెటీరియల్ తీసుకువెళ్లే వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. లైజన్ అధికారులు మెటీరియల్ తీసుకెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉదయం, మధ్యాహ్నం నిర్వహించే పరీక్షలకు రెండు రంగులు ఉంటాయన్నారు. చెక్ లిస్ట్‌తో డిస్పాచ్ చేయాలని ఆదేశించారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా దూర ప్రాంతాల నుంచి సరిపడా బస్సులు నడపాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు.

పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ముందుగానే సిటింగ్ ఏర్పాట్లు, వెలుతురు ఉందా లేదా చూడాలని, దీనిపై చీఫ్ సూపరింటెండెంట్లు దృష్టిసారించాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైందని, పరీక్షకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా 08942 240557 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. కంట్రోల్ రూమ్ ఆదివారం సాయంత్రం వరకు పనిచేస్తుందని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఎపిపిఎస్‌సి నుంచి సహాయ కార్యదర్శి బి.ఎస్ మూర్తి, డిఎస్‌పి మహేంద్ర, ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్లు ప్రశాంత్, బ్రహ్మేశ్వరరావు, పలువురు అధికారులు, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆగని బియ్యం దందా

- జిల్లాలో పలుచోట్ల పట్టుబడుతున్న రేషన్ బియ్యం నిల్వలు
- తాజాగా శ్రీకూర్మంలో 27 క్వింటాళ్ల పట్టివేత
- ఫిర్యాదులు వస్తేనే స్పందిస్తున్న అధికారులు
- సాధారణ రోజుల్లో అంతంతమాత్రంగానే తనిఖీలు

జిల్లాలో రేషన్ బియ్యం దందా కొనసాగతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏదో ఒకచోట బియ్యం పట్టుబడుతూనే ఉంది. సరుబుజ్జిలి మండలం చిన్నకాగితాపల్లిలో గత నెల 20వ తేదీన ఓ ఇంటిపై విజిలెన్స్ అధికారులు దాడి చేసి 11.50 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. తాజాగా ఈనెల ఐదో తేదీన గార మండలం శ్రీకూర్మంకు చెందిన నాగమణి ఇంట్లో విజిలెన్స్ అధికారులు దాడులు చేసి 27 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారులు అడపాదడపా రేషన్ బియ్యం, వాహనాలు స్వాధీనం చేసుకుంటున్నా అక్రమ రవాణాను నిలువరించలేకపోతున్నారు. స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తేనే అధికారులు స్పందిస్తుండడంతో కొన్నిచోట్లే వెలుగు చూస్తున్నాయి. సాధారణ రోజుల్లో అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో యథేచ్ఛగా వ్యాపారం సాగుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్ (ఎండియు) ద్వారా ప్రభుత్వం జిల్లాలో ప్రతి నెల సుమారు 6.58 లక్షల మంది బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార అందిస్తోంది. వీరిలో రేషన్ బియ్యం అవసరం లేని వారిని వ్యాపారులు గుర్తించి, వారి నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. చౌక ధరల దుకాణాలు అందిస్తున్న బియ్యాన్ని కేజీ రూ.14 నుంచి రూ.15 మధ్య కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వాలంటీర్లే వారి వేలిముద్రలు వేసి బియ్యం అందించినట్లుగా లెక్క చూపి, అలా మిగిలిన బియ్యాన్నీ కొనుగోలు చేస్తున్న సందర్భాలు గతంలో వెలుగు చూశాయి. లబ్ధిదారులకు కొంత సరుకు పంపిణీ చేయగా ఎండియు వాహనాలు, రేషన్ దుకాణాల్లో మిగిలిన బియ్యాన్నీ వ్యాపారులు కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నట్లు తెలుస్తోంది. అలా పెద్దఎత్తున బియ్యాన్ని నిల్వ చేస్తున్న క్రమంలో అధికారులకు పట్టుబడుతున్నారు. గ్రామాల్లో, వీధుల్లోని చిల్లర దుకాణాలు రూ.14 నుంచి రూ.15 మధ్య కొనుగోలు చేస్తుంటే, వాటిని పెద్ద వ్యాపారులు రూ.20 వరకు చెల్లించి కొంటున్నారు.

బియ్యం నిల్వలపై తనిఖీలేవి?

బియ్యం కొందరికి వ్యాపార సరుకుగా మారిపోయింది. బియ్యం అవసరం లేని వారి నుంచి చౌకగా కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. అధికారులు కేసులు నమోదు చేస్తున్నా, జిల్లాలో ఏదో ఒక చోట బియ్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడుతున్నారు. బియ్యంతో పట్టుబడిన వ్యక్తులకు రైసు మిల్లు ఉంటే పోనీ పౌర సరఫరాల సంస్థ ధాన్యం మర ఆడించేందుకు ఇచ్చినట్లుగా అనుకోవచ్చు. కనీసం బియ్యం వ్యాపారం చేస్తున్నా అంత పెద్ద మొత్తంలో నిల్వ ఉంచినా అర్థముంది. టన్నుల కొద్దీ బియ్యం నిల్వ ఉంచడం అనేక అనుమానాలకు దారితీస్తోంది. జిల్లాలోని పలుచోట్ల



ఈ దందా సాగుతోంది. రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదులు వస్తేనే స్పందిస్తున్నారు తప్ప ఇతర సందర్భాలల్లో స్పందించడం లేదు. రైసు మిల్లులు, బియ్యం వ్యాపారుల దుకాణాల్లోనూ తనిఖీలు పెద్దగా చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కాకినాడ పోర్టుకు రేషన్ బియ్యం?

జిల్లాలో వ్యాపారులు కొనుగోలు చేస్తున్న రేషన్ బియ్యం కాకినాడ పోర్టుకు తరలిపోతున్నట్లు తెలుస్తోంది. అక్కడ నుంచి షిప్‌ల ద్వారా విదేశాలకు వెళ్తున్నట్లు గతంలో అనేక వార్తలు వచ్చాయి. ప్రధానంగా ఆఫ్రికన్ దేశాలకు తరలిపోతున్నట్లు తెలుస్తోంది. అక్కడ కిలో రూ.50 నుంచి రూ.60 వరకు అమ్ముడుపోతున్నట్లు రైస్ మిల్లర్ల మాటల్లో వ్యక్తమవుతోంది.

వలసల నివారణకు హార్బర్లు

- మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ సహకారం
- మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

మత్స్యకారుల వలసలను నివారించి, వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతోందని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని బుడగట్లపాలెంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌తో కలిసి హార్బర్ నిర్మాణానికి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు మత్స్యకారులను నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. జిల్లాలో ఉన్న సుదీర్ఘ తీర ప్రాంతంపై ఆధారపడి వేలాది మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. వారి బతుకుల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో పాదయాత్రలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నారని చెప్పారు. రూ.340 కోట్లతో బుడగట్లపాలెం హార్బర్ నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం రూ.120 కోట్లు ఇస్తుందని తెలిపారు. జిల్లా నుంచి వలస పోతూ ఇతర రాష్ట్రాలు, దేశాల్లో పనిచేసుకున్న మత్స్యకారులు కరోనా సమయంలో ఎంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి స్థానికంగా పనిచేసుకునే అవకాశం కల్పించేందుకే ప్రభుత్వం హార్బర్ల నిర్మాణం చేపడుతోందన్నారు. హార్బర్ల నిర్మాణాలు పూర్తయితే మత్స్యకారుల కష్టాలు తొలగిపోతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు మంచినీళ్లపేట వద్ద ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. మంచినీళ్లపేట వద్ద జెట్టీ నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం అనుమతులతో పూర్తిస్థాయి హార్బర్‌గా మార్చుకోబోతున్నామని అన్నారు. జిల్లాలో రెండు హార్బర్లు పూర్తయితే మత్స్యకారుల వలసలు ఉండవన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాటకో రేటు పెట్టుకుని ప్యాకేజీలు తీసుకుంటూ చంద్రబాబుకు దత్తపుత్రుడిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మిత్రపక్షంగా ఉన్న పవన్ మత్స్యకారుల సంక్షేమానికి ఏం చేశారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, మత్స్యశాఖ జెడి సత్యనారాయణ, జెడ్‌పిటిసి బల్లాడ హేమామాలిని రెడ్డి, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, మాజీ ఎంపిపి బల్లాడ జనార్ధనరెడ్డి, సర్పంచ్ ఎ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ ఉద్యోగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - ఆమదాలవలస

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కోరారు. సచివాలయ ఉద్యోగులతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అర్హత గల ఉద్యోగులకు ప్రొబేషన్ ఖరారు చేయాలని కోరారు. మరణించిన సచివాలయ ఉద్యోగుల కుటుంబాల్లో అర్హత కలిగిన వారికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. సచివాలయాల్లో పనిచేస్తున్న సంక్షేమ, విద్యా సహాయకులకు బిఎల్‌ఒ విధుల నుంచి తప్పించాలన్న ఎన్నికల సంఘం కమిషనర్ ఆదేశాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా సహాధ్యక్షులు కిలారి నారాయణరావు, జిల్లా కార్యదర్శి అలికాన రాజేశ్వరి, ఉపాధ్యక్షులు సంతోష్ , జెడ్‌పి యూనిట్ అధ్యక్షులు జయమ్మ, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు విశ్వంత్, మల్లేష్ తదితరులున్నారు.



రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

రైస్‌మిల్లు సీజ్

గార : ధాన్యం కొనుగోలులో క్వింటాకు రెండు నుంచి ఐదు కేజీల వరకు రైతుల నుంచి అదనంగా తీసుకుంటున్న శ్రీ రాజరాజేశ్వరి రైస్‌మిల్లును జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సీజ్ చేయించారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు జెసి మండలంలోని శ్రీకూర్మంలో గల శ్రీ రాజరాజేశ్వరి రైస్‌మిల్లును శుక్రవారం తనిఖీ చేశారు. రైతులను విచారణ చేయగా వాస్తవమేనని తేలడంతో రైస్‌మిల్లును సీజ్ చేయించారు. మండలంలోని బోరవానిపేటలోని శ్రీలక్ష్మి మోడ్రన్ రైస్‌మిల్లు రెండు కేజీలు అదనంగా అడుగుతున్నారని ఫిర్యాదు రావడంతో, మిల్లు యజమానిని జెసి తీవ్రంగా హెచ్చరించి రూ.20 వేల జరిమానా విధించారు. తనిఖీల్లో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటరమణ, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ పి.జయంతి, తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

మాల్దీవుల్లో చిక్కుకున్న వారిని రప్పించండి

కేంద్ర విదేశాంగ శాఖ మంత్రికి ఎంపీ లేఖ

శ్రీకాకుళం అర్బన్ : ఉపాధి నిమిత్తం మాల్దీవులకు వెళ్లి చిక్కుకుపోయిన 53 మంది భారతీయ వలస కార్మికులను స్వదేశానికి రప్పించే చర్యలు చేపట్టాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుబ్రమణ్యం జైశంకర్‌ను కోరారు. ఈమేరకు ఆయన లేఖ రాశారు. గతేడాది డిసెంబరు 16న ఉపాధి కోసం మాల్దీవులకు వెళ్లిన భారత వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈనెల నాలుగో తేదీన కార్మికులు మాల్దీవుల నుంచి వీడియోకాల్ ద్వారా తనతో మాట్లాడి వారి కష్టాలను వివరించారని చెప్పారు. అక్కడ చిక్కుకున్న వారిలో శ్రీకాకుళం జిల్లావాసులూ ఉన్నారని తెలిపారు. వేతనాలు ఇవ్వకపోవడంతో పనికి వెళ్లలేమని చెప్పిన కార్మికుల పాస్‌పోర్టులను కంపెనీ యాజమాన్యం తమ వద్ద ఉంచుకుని వారిని ఇబ్బందులకు గురిచేస్తోందని చెప్పారు. ఇప్పటికే కొందరు అనారోగ్యం బారిన పడ్డారని, మరోవైపు వీసా గడువూ పూర్తవుతున్నందున స్వస్థలాలకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని వివరించారు. సత్వరమే స్పందించి వారిని స్వదేశానికి తీసుకురావాలని కోరారు.

ఎసిబికి చిక్కిన విఆర్‌ఒ

- మ్యుటేషన్ కోసం రూ.మూడు వేలు డిమాండ్
- లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

ప్రజాశక్తి - పొందూరు

పొందూరు మండలం కనిమెట్ట విఆర్‌ఒ ఎం.గోవింద రావు అవినీతి నిరోధక శాఖ అధికారులకు శుక్రవారం చిక్కారు. భూమి మ్యుటేషన్ కోసం రూ.మూడు వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఎసిబి శ్రీకాకుళం డిఎస్‌పి బి.వి.ఎన్.ఎన్ రమణ మూర్తి తెలిపిన వివరాల మేరకు... కనిమెట్టకు చెందిన బొడ్డేపల్లి భారతమ్మ గ్రామంలో ఉన్న తన భూమిని మ్యుటేషన్ కోసం గతేడాది డిసెంబరులో దరఖాస్తు చేశారు. గడువు పూర్తయినా మ్యుటేషన్ కాకపోవడంపై విఆర్‌ఒ గోవిందరావును ప్రశ్నించారు.



ఎసిబికి పట్టుబడిన విఆర్‌ఒ గోవిందరావు

తనకు రూ.మూడు వేలు లంచం ఇస్తేనే మ్యుటేషన్ చేస్తానని ఆయన చెప్పడంతో అందుకు ఆమె అంగీకరించారు. ఈనెల నాలుగో తేదీన మ్యుటేషన్ కోసం మళ్లీ దరఖాస్తు చేశారు. విఆర్‌ఒ తీరుపై విసుగు చెందిన ఆమె ఎసిబి అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు ఆమె విఆర్‌ఒకు ఫోన్ చేసి డబ్బులు ఇస్తానని చెప్పడంతో, తహశీల్దార్ కార్యాలయానికి రావాలని చెప్పాడు. ఆమె సమీప బంధువు నాగరాజు రూ.మూడు వేలు పట్టుకుని వెళ్లి తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒకు ఇస్తుండగా, ఎసిబి అధికారులు దాడి చేశారు. డబ్బులను స్వాధీనం చేసుకున్నాక విఆర్‌ఒ స్టేట్‌మెంట్ తీసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం ఆయన్ను విశాఖపట్నంలోని ఎసిబి కోర్టుకు తరలించారు. దాడిలో ఎసిబి సిఐలు భాస్కరరావు, హరి, ఎస్‌ఐలు చిన్నంనాయుడు, సత్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎకరాకు రూ.26 లక్షలు

మూలపేట భూములకు పరిహారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

భావనపాడు పోర్టు ప్రభావిత గ్రామమైన మూలపేట భూములకు ఎకరాకు రూ.26 లక్షల పరిహారం నిర్ణయించినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వెల్లడించారు. పోర్టు భూసేకరణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మూలపేట రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించి ధరను నిర్ణయించారు. మూలపేటలో 54 ఎకరాల భూమి కావాల్సి ఉండగా, 25 ఎకరాలకు సంబంధించి రైతులతో చర్చిస్తున్నట్లు సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి వివరించారు. మరో 30 ఎకరాల భూమి కావాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. 32 మంది రైతులతో చర్చించి 25 ఎకరాల భూమిని ఎకరా రూ.26 లక్షలకు ధర నిర్ణయించినట్లు చెప్పారు. రోడ్డుకు దగ్గరగా ఉన్నందు వల్ల రూ.26 లక్షలకు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామసభ తీర్మానం జరిగిందీ, లేనిదీ సంతబొమ్మాళి తహశీల్దార్ చలమయ్యను అడిగి తెలుసుకున్నారు. మరో



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

30 ఎకరాల భూమి కావాల్సి ఉందని, ఆ భూమి వచ్చిన నెల రోజుల్లోనే నౌపడ వద్ద పునరావాస కాలనీలకు రోడ్లు, కాలువలకు శంకుస్థాపన చేస్తామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సంతబొమ్మాళి సర్పంచ్ పి.రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు పిఎం సురక్ష యోజన

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధి హామీ కూలీలందరికీ ప్రధానమంత్రి సురక్ష యోజన బీమా పథకాన్ని వర్తింపజేయనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల ఎంపిడిఒలు, ఎపిఒలు, ఎపిఎంలు, ఉపాధి హామీ సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వెలుగు ఎపిఒలతో సమన్వయం చేసుకుని ఉపాధి కూలీలను ఈ పథకంలో చేర్పించాలని సూచించారు. 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు ఈ పథకానికి అర్హులని తెలిపారు. లబ్ధిదారులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.రెండు లక్షలు, అంగవైకల్యం సంభవిస్తే రూ.లక్ష పరిహారంగా బీమా సంస్థ చెల్లిస్తుందని చెప్పారు. ప్రతి కూలీ ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. కూలీలందరూ ఈ పథకంలో చేరే విధంగా సిబ్బందికి లక్ష్యాన్ని నిర్దేశించారు. ఎంసిసిల పరిధిలో ఇప్పటికే ఎం-బుక్‌లో రికార్డు చేసిన అన్ని మెటీరియల్ బిల్లులు అప్‌లోడ్ చేయాలని, ఇందుకు సంబంధించిన సమాచారాన్ని



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ కొన్ని మండలాల్లో ఇంతవరకు పూర్తి కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా 61 పని దినాలు ఉన్నందున పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రెండు లక్షల జాబ్ కార్డుదారులకు వంద రోజుల పనిదినాలు కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. సగటు కూలి రూ.250కి తగ్గితే సహించేది లేదన్నారు. మారిన నిబంధనలకు అనుగుణంగా సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ప్లాంటేషన్ పనుల్లో భాగంగా పోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటే కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష యోజన బీమా పథకం అమలుపై ఎంపిడిఒలు ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి బుధవారం మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించే ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో వీటి ప్రగతిని అడిగి తెలుసుకోవాలన్నారు. సమావేశంలో ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఎపిడిలు శైలజ, యుగంధర్, హరిత, ప్లాంటేషన్ మేనేజర్ శ్యామల, సూపర్‌వైజర్ జి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్ పర్యటన

ప్రజాశక్తి - కవిటి




బెంతు ఒరియాల స్థితిగతులను పరిశీలిస్తున్న శామ్యూల్

బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని వచ్చిన వినతులపై అధ్యయనానికి వచ్చిన ఏకసభ్య కమిషన్ సభ్యుడు ఐ.శామ్యూల్ ఆనంద్ కుమార్ ఐటిడిఎ పిఒ నవ్యతో కలిసి కవిటి మండలం మాణిక్యపురం, బల్లెపుట్టుగ, వరక, జల్లుపుట్టుగ, తిప్పనపుట్టుగ, కంచిలి మండలం కొన్నాయిపుట్టుగ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. బెంతు ఒరియాల జీవన, ఆర్థిక స్థితిగతులను తెలుసుకున్నారు. ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడంతో తమ బిడ్డల భవిష్యత్ నాశనమవుతోందనిమాజీ ఎమ్మెల్యే, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, కొక్కిలిపుట్టుగ, కొన్నాయిపుట్టుగ సర్పంచ్‌లు లలిత సాహు, గంగాధర్ సాహు, బెంతు ఒరియాల ప్రతినిధులు రజనీకుమార్ దొలై, దేవరాజ్ సాహు, శివ బిసాయి, శ్రీకాంత్ పురియా తదితరులు కమిషన్‌కు వివరించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో తాము అట్టడుగు స్థానంలో ఉన్నామని, చాలామంది ఉపాధి లేక వలసలు పోతున్నారని తెలిపారు. న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలాస ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, ఎంపిటిసి సత్యవతి సాహు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - పొందూరు



రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో విజిలెన్స్ అండ్ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల పనితీరు పరిశీలనలో భాగంగా ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎ.సురేష్‌బాబు ఆదేశాల మేరకు తనిఖీలు చేశారు. ఆస్పత్రిలో మందులు, పారిశుధ్య నిర్వహణ తీరు, రికార్డులను పరిశీలించారు. సుమారు నాలుగు గంటల పాటు తనిఖీలు చేపట్టిన అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ అశోక్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - పలాస


విజేతలను అభినందిస్తున్న అప్పలరాజు

క్రీడల్లో రాణిస్తే పేరు, ప్రఖ్యాతులలతో పాటు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ మంత్రి కార్యాలయం ఆవరణలో 66వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ విజేతలను అప్పలరాజు శుక్రవారం అభినందించారు. ఇటీవల చోడవరంలో జరిగిన 66వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలో శ్రీకాకుళం నుంచి మహిళా విభాగంలో పలాస నియోజకవర్గం మెట్టూరు గ్రామానికి చెందిన బాలికలు గ్రీష్మ, మౌనిక ద్వితీయ స్థానం సాధించారు. పురుషుల విభాగంలో కాశీబుగ్గ నుంచి మణికంఠ, దేవిశ్రీ ప్రసాద్ తృతీయ స్థానంలో నిలిచారు. వీరిలో మౌనిక, గ్రీష్మ జాతీయ స్థాయికి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ విద్యా కమిటీ చైర్మన్ ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

యువతకు క్రీడలు అవసరం

ప్రజాశక్తి - పలాస


మాట్లాడుతున్న చిట్టిబాబు

యువతకు చదువుతో పాటు క్రీడలు అవసరమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం టి.చిట్టిబాబు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పి.చిరంజీవులు అన్నారు. పలాస ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన క్రీడా పోటీలు అలరించాయి. కాశీబుగ్గ బ్లాక్ స్థాయిలో పలాస, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి మండలాలు క్రీడాకారులకు వంద మీటర్ల పరుగు పందెం, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కబడ్డీ విజేతగా పద్మనాభపురం, రన్నర్‌గా తాళభద్ర, వాలీబాల్ విజేతగా పలాస, రన్నర్‌గా సూదికొండ, వంద మీటర్ల పరుగుపందెంలో ఎం.సతీష్, డి.చాణక్య, జి.సాయికుమార్ వరుస మూడు స్థానాల్లో నిలిచారని పిఇటి సంఘం సంయుక్త కార్యదర్శి తవిటయ్య తెలిపారు. కార్యక్రమంలో పీడీ పి.మధు, ఆర్.లీలాప్రసాద్‌రెడ్డి, కె.హరిబాబు, పద్మలోచన, కె.రామారావు, పి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌కు అభినందనలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం


శ్రీకాంత్‌ను అభినందిస్తున్న కృష్ణదాస్

ఇచ్ఛాపురానికి చెందిన యోగా క్రీడాకారుడు శ్రీకాంత్ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాడు. నాలుగో స్థానంలో నిలిచాడు. పాండిచ్చేరిలో ఇండియా యోగా ఫెడరేషన్ ఆధ్వర్యాన ఇటీవల జరిగిన పోటీతల్లో శ్రీకాంత్ ప్రతిభ కనబర్చి స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ అభినందించారు. మరిన్ని ప్రదర్శనలు ఇచ్చి, జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు.

ఆర్గానిక్ మేళాలో సిక్కోలు బెల్లం

ప్రజాశక్తి - ఆమదాలవలస


బెల్లం అమ్ముతున్న రైతులు

విజయవాడలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళాలో సిక్కోలు బెల్లంకు మంచి ఆదరణ లభిస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ మేనేజర్ రేవతి తెలిపారు. మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లాడ గ్రామాల్లో ఆర్గానిక్ పద్ధతిలో తయారు చేసిన బెల్లాన్ని విజయవాడలోని బందర్ రోడ్‌లోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఈ మేళాను నేటి నుండి మూడు రోజులు పాటు జరగనున్నట్లు తెలిపారు. ఈ మేళాలో రెండు క్వింటాళ్ల ప్రకృతి సేద్యం బెల్లాన్ని అమ్మకం కోసం పెట్టినట్లు తెలిపారు. సందర్శకులు సహజ సేద్య బెల్లాన్ని చూసి ఆసక్తితో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేళాలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శోభన్, జనార్ధన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

చీకటి జిఒను రద్దు చేయాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస


నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం రాత్రికి రాత్రి విడుదల చేసిన చీకటి జిఒను రద్దు చేయాలని టిడిపి మండల అధ్యక్షులు అంబళ్ల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ సభలు, సమావేశాలు, రోడ్‌షోలకు అనుమతి లేదని చెప్పడం దారుణమన్నారు. లోకేష్ పాదయాత్ర, చంద్రబాబు సభలకు వస్తున్న జనాన్ని చూసి ఓర్వలేకే వైసిపి ఈ జిఒను తెచ్చిందని ఆరోపించారు. టిడిపి ఇటువంటి ఆంక్షలను పెడితే జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసేవారా అని ప్రశ్నించారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్షాల గొంతు నొక్కాలని ప్రభుత్వం చూడటం దారుణమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శివ్వాల సూర్యనారాయణ, కూన గణపతి, పేడాడ రమణ, మీసాల రామారావు, కె.వెంకటరావు, వై.రామారావు, కె.రవికుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో భారాలు

టెక్కలి: వైసిపి పాలనలో ప్రజలు సంక్షేమాన్ని మరిచిపోయి, సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతు రామకృష్ణ అన్నారు. మండలంలోని పెద్దరోకళ్లపల్లిలో శుక్రవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో ప్రజలపై భారాలు మోపుతున్నారని అన్నారు. అనంతరం ప్రభుత్వ వైఫల్యంపై ప్రజలకు వివరించారు. తొలుత గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆర్.ధర్మారావు,ఎం.రాము, రెయ్యి ప్రతీష్‌చంద్, మెండ దమయంతి, కె.కామేష్, ప్రసాద్‌రెడ్డి, పి.చిన్నయ్యరెడ్డి, సతీష్, మన్మథరావు, అప్పారావు, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు అందజేత

ప్రజాశక్తి - పొందూరు

పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త జె.వి.ఆర్ సంస్థల అధినేత కుమారుడు అనిల్‌కుమార్ శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులకు క్రీడా దుస్తులను వితరణగా అందజేశారు. సుమారు రూ.11వేలు విలువ చేసే దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.వి.రామరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు దండా ఉదయ్‌కుమార్, కె.గణపతిరావు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రూ.50వేలు వితరణ


విరాళాన్ని అందజేస్తున్న తిరుమలరావు

పొందూరు: మండలంలోని తోలాపి పెద్దవీధిలో నీలమ్మ పేరంటాల ఆలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు పప్పల తిరుమలరావు రూ.50వేలు శుక్రవారం విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని తన తండ్రి చేతులు మీదుగా ఆలయ కమిటీ నిర్వాహకులు పొన్నాడ సూర్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పప్పల రాధాకృష్ణ, ఎన్ఆర్ఐ పాత్రుని శ్రీనివాసరావు, పైడి కనకారావు, పొన్నాడ గణపతిరావు, వార్డు సభ్యులు నీలమ్మ,చంద్రరావు, రామారావు, రామచంద్రరావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

మైక్ సౌండ్ అండ్ లైటింగ్, సప్లయర్స్ యూనియన్ అధ్యక్షులుగా సుదర్శనరావు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

మైక్‌సెట్ సౌండింగ్ అండ్ లైటింగ్ సప్లయర్స్ యూనియన్ టెక్కలి నియోజకవర్గ అధ్యక్షులుగా కూన సుదర్శనరావును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో మైక్ సెట్, సప్లయర్స్ యజమానుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా సుదర్శనరావును అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా అప్పలరాజు, కార్యదర్శిగా మురళీకృష్ణ, సహాయ కార్యదర్శిగా కోరాడ కోదండరాం, కోశాధికారిగా రాంజీ, మరికొందరు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రావు మాట్లాడుతూ సంఘం తరపున ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న వారిని ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పండ్రి నారంనాయుడు, తిరుపతి, రుషి, తదితరులు పాల్గొన్నారు.

రెక్కల కష్టం మాయం

- ఖాతాదారుల ప్రమేయం లేకుండా ఖాతాల్లో నగదు విత్‌డ్రా
- ఎస్‌బిఐ వద్ద బాధితుల ఆందోళన

ప్రజాశక్తి - కవిటి


బ్యాంకు మేనేజర్ వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు

'కన్న కొడుకు కరోనాతో మరణించాడు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 వేలు ఇచ్చింది. ప్రస్తుతం భార్య అనారోగ్యంతో మంచం పట్టింది. ఆమెకు నయం చేసేందుకు బ్యాంకులో ఉన్న రూ.50వేలు తీసేందుకు వెళ్తే డబ్బులు లేవని చెప్పారు. తనకు దిక్కెవరు, నా భార్యను ఎలా కాపాడుకోవాలి' అని ఎస్‌బిఐ సిబ్బంది, మేనేజరును మండలంలోని ఇదివానిపాలెంకు చెందిన రత్నాల సుఖదేవ్‌సాహు ప్రశ్నించాడు. కన్నీటిపర్యాంటమై సొమ్మసిల్లి పడిపోయాడు. విషయం తెలుసుకున్న నగదు పోయిన మిగతా ఖాతాదారులు బ్యాంక్‌కు చేరుకొని తమ నగదును తిరిగి చెల్లించాలని బ్యాంకు మేనేజరును ప్రశ్నించారు.

మండలంలో సుమారు 40 నుంచి 50 మంది డబ్బులు పోయాయని బాధితులు తెలిపారు. బ్యాంకు అధికారులను సంప్రదిస్తే రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కానీ, తెలియని వ్యక్తులు కానీ సంస్థల వద్ద వేలి ముద్రలు వేశారా అని అడుగుతున్నారని, కానీ మాలో 90 శాతం మందికి రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎక్కడో ఉందో కూడా తెలియదని అన్నారు. ఎటువంటి వేలి ముద్రలు లేకుండా, సెల్ ఫోన్లకు వస్తున్న సందేశాలకు స్పందించకుండానే డబ్బులు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోయిన డబ్బులు వారం రోజుల్లోగా బాధితుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని, లేని పక్షంలో తమ ఆందోళనలు ఉధృతం చేసి, బ్యాంకుల మనుగడే ప్రశ్నార్థకంగా మారేలా చేస్తామని హెచ్చరించారు.

నగదు పోయిన బాధితులు

కవిటి గ్రామానికి చెందిన బి.శ్రీరామ్మూర్తి రూ.16600, రామిసెట్టి వెంకటరావు రూ.18000, వజ్జ జయదేవ్ రూ.30000, బదకల ఈశ్వరరావు రూ.25000, దున్న పురుషోత్తం రూ.10000, పొల్లాయి యశోద రూ.4990, పులకల వెంకటరావు రూ.4300, పిరియా సుధాకర్ రూ.10000 చొప్పున డబ్బులు పోగొట్టుకున్నారు.

బ్యాంకుల్లో రక్షణ లేకుంటే ఎలా..

పిల్లల చదువు కోసం, పెళ్లిళ్ల, వృద్ధాప్యంలోభరోసా కోసం బ్యాంకుల్లో డబ్బులు దాచుకుంటాం. వాటికే బ్యాంకుల్లో భద్రత లేకుంటే ఇంకెక్కడికి వెళ్తాం. మా ఖాతాల్లో పోయిన నగదుకు బ్యాంకుదే బాధ్యత. మా నగదును మాకు తిరిగి ఇప్పించాలి.

\- మొగిలిపురి సీతాలు, కవిటి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

తమ ఖాతాలోంచి నగదు పోయిన వారు ఎవరైనా రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి. ఇప్పటికే పలువురి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ పూర్తి చేశాం. ఉన్నతాధికారుల నుంచి బాధితులకు ఫోన్ వస్తుంది. వారి సూచన మేరకు తిరిగి పోయిన నగదు ఖాతాలో జమయ్యే అవకాశముంది.

\- డి.అశోక్ చక్రవర్తి, మేనేజర్, ఎస్‌బిఐ, కవిటి

హౌసింగ్ సిబ్బంది పనితీరు మార్చుకోవాలి

ప్రజాశక్తి - బూర్జ

గృహ నిర్మాణశాఖ అధికారులు సిబ్బంది పనితీరును మార్చుకోవాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం సాయంత్రం బూర్జలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారితో మమేకమయ్యారు. ముందుగా వారి సమస్యలను అడిగి తెలిసుకున్నారు. జగనన్న పథకాలు అందుతున్నాయా? లేదా అని లబ్ధిదారులను ప్రశ్నించారు. గృహ నిర్మాణశాఖ అధికారులు లబ్ధిదారులను కలిసి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. బిల్లులు త్వరితగతిన చెల్లించాలని నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కోటి, డిఇ నర్సింగరావు, ఎఇ ఎంవి.రమణమూర్తిని ఆదేశించారు.

బిసి కాలనీలో సమస్యల వెల్లువ

తమ సమస్యలు పరిష్కరించాలని స్పీకర్ వద్ద బిసి కాలనీ వాసులు మొరపెట్టుకున్నారు. రోడ్లు, కాలువలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. బోర్లు వేయాలని దుర్గమ్మ, చంద్రవతి కోరారు. బిసి కాలనీ నుంచి టిటిడి కళ్యాణ మండపం వరకు రోడ్డు వేయాలని నరసింహారావు కోరారు. స్పీకర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బి.రామారావు, ఖండాపు గోవిందరావు, గుమ్మడి రాంబాబు, జల్లు బలరాంనాయుడు, అనురాధ, శ్రీకాంత్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.


ఆమదాలవలస: మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం


జి.సిగడాం: మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని జగన్నాథవలసలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే జి.కిరణ్‌కుమార్ గ్రామంలోని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బి.వెంకటరమణ, ఎంపిపి మీసాల సత్యవతి, ఎంపిపి ప్రతినిధి వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, ఎ.జగన్నాథం, మీసాల సాద్వీమణి, రాంబాబు, వెంకటరావు, ఎన్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


మెళియాపుట్టి: అవగాహన కల్పిస్తున్న రెడ్డి శాంతి

మెళియాపుట్టి: మండలంలోని సవర శేఖరాపురం, కొండవీధి, సవరకొలిగాం, కోతి కొలిగాం,తంగిని, భావనాపురం, భవనాపురం కాలనీ, మాకనాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగారు. అనంతరం నూతన పింఛన్లను పంపిణీ చేశారు. సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బి.ఉదయ్‌కుమార్, జి.ఎండయ్య, యోగి, యు.బాలరాజు,ఆదినాయుడు, ఎస్.రంగారావు, సవర రవికుమార్, కన్నబాబు, చంద్రరావు, బాలరాజు, బి.పున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు ఊపిరి 'వీర గున్నమ్మ'

ప్రజాశక్తి - పలాస

సాయుధ రైతాంగ పోరాటం, మందస జమిందారీ వ్యతిరేక పోరాటానికి ఊపిరి వీర గున్నమ్మ అని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలో శుక్రవారం ఎస్‌వి థియేటర్‌లో విప్లవ సేనాని వీర గున్నమ్మ సినిమా విడుదల సందర్భంగా చిత్ర నటుల మధ్య కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాలకు పుట్టినిల్లు అయిన శ్రీకాకుళం చరిత్రను భావి తరాలకు తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలని కోరారు. చిత్ర దర్శకుడు గూన అప్పారావు మరెన్నో చిత్రాలు నిర్మించాలని కోరారు. చిత్ర నటీ, నటులను ఆయన అభినందించారు. అనంతరం మంత్రి స్వయంగా టికెట్ తీసుకొని సినిమాను వీక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, డబ్బీరు భవానీశంకర్, లఖినాన వెంకటాచలం, కుమార్‌నాయక్, అమ్మ రామకృష్ణ, ఎం.రామారావు, తదితరులు పాల్గొన్నారు.


వెంకటాచలంకు కేకును తినిపిస్తున్న అప్పలరాజు

మహిళలు ఆదర్శంగా తీసుకోవాలి

ఆమదాలవలస: వీర గున్నమ్మను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని సిటిజన్ ఫోరం అధ్యక్ష, ప్రధానకార్యదర్శి జెజె. మోహన్‌రావు, బి.మోహన్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీదేవి థియేటర్‌లో సినిమా విడుదల సందర్భంగా కేకును కట్‌చేశారు. అనంతరం సినిమాను వీక్షించారు. తెలుగింటి ఆడపడుచుల పౌరుషానికి ప్రతీక గున్నమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో సనపల అన్నాజీరావు, బి.జనార్ధన్‌రావు, బి.నారాయణరావు, సింధూర రమేష్‌నాయుడు, సువ్వారి జగన్నాథరావు పాల్గొన్నారు.

సోంపేట: మందసలోని మహేంద్ర థియేటర్ వద్ద మందస తహశీల్దార్ బి.పాపారావు, ఎంపిడిఒ వి.తిరుమలరావు వీర గున్నమ్మ సినిమా విడుదల సందర్భంగా కేకును కట్ చేశారు. వారు మాట్లాడుతూ స్థానిక నటులతో సినిమాను తీయడం సాహసేమనని అన్నారు. కార్యక్రమంలో మకరజోల సర్పంచ్ బమ్మిడి ధర్మారావు, ఎంపిటిసి వి.మాధవరావు, వై.నాగేశ్వరరావు, ఎస్.జగ్గారావు, రమణమూర్తి, ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

'వీరగున్నమ్మ' సందడి

టెక్కలి: విప్లవ సేనాని వీరగున్నమ్మ చిత్ర నటులు టెక్కలిలో సందడి చేశారు. ధర్మనీలాపురానికి చెందిన గూన అప్పారావు నిర్మించిన సినిమా విడుదల సందర్భంగా టెక్కలి భవానీ థియేటర్‌లో చిత్రాన్ని శుక్రవారం ప్రదర్శించారు. సినీ హీరో గూన భరద్వాజ్, టెక్కలికి చెందిన ఉపాధ్యాయులు, ప్రజా చైతన్య కళా సమితి నిర్వాహకులు దూసి ఆంధ్రాస్టాలిన్, మూల తాతయ్య, మల్లారెడ్డి పద్మనాభం, ఉత్తరకవాటం గణపతిరావు, బమ్మిడి కృష్ణారావు థియేటర్ వద్దకు చేరుకొని కేకు కట్ చేసి, అభిమానులకు తినిపించారు. కార్యక్రమంలో నాయకులు షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య, జెవివి జిల్లా అధ్యక్షులు కె.కామేశ్వరరావు, వైకుంఠరావు, లక్ష్మీనారాయణ, పి.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై అనధికారుల అజమాయిషీ

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల అధికారులపై అనధికార వ్యక్తులు అజమాయిషీ చేయడం పలువురిని ఆశ్చర్యపరిచింది. శుక్రవారం ఎంపిపి మేరుగు రాజేశ్వరి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అదే సమయంలో పెంచిన పింఛన్లు పంపిణీ కార్యక్రమం జరగడంతో సమావేశం కాస్త ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో అధికారులు పనులు మాని నాయకుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఎదురైంది. ఈ నేపథ్యంలో పలువురు అధికారులు అసహనం వ్యక్తం చేశారు. అదీ కాకుండా సమస్యలు ప్రస్తావనలో అత్యధిక మంది సభ్యులు కాని వారే అధికారులను నేరుగా నిలదీయడంతో పలు విమర్శలు వినిపించాయి. రెవెన్యూ శాఖ పనుల విషయమై తహశీల్దార్ అందుబాటులో ఉండడం లేదని పలువురు సభ్యులు, లేఅవుట్ సమస్యలు పరిష్కరించడం లేదని మరికొందరు సభ్యులు రెవెన్యూ అధికారులను నిలదీశారు. హౌసింగ్‌పై జరిగిన చర్చలో విజిలెన్స్ కేసులో ఉన్న గ్రామాల్లో కొత్తగా ఇల్లు మంజూరు కావడం లేదన్న సమస్యలను అనధికార వ్యక్తులే ప్రశ్నించారు. గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భాగంగా పనిచేసిన పలువురు మహిళలు సమావేశం మధ్యలో వచ్చి బిల్లు పడటం లేదని అధికారుల ముందు గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై కొంతమంది ఈ అనధికార సభ్యులే వారిని పంపిచేయడం చర్చనీయాంశమైంది. అప్పటికే సమయాభావం కావడం వల్ల మరికొన్ని శాఖలపై జరగాల్సిన సమీక్ష సంతకాలతోనే ముగించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపిడిఒ ఉమా సుందరి, హౌసింగ్ డిఇ, ఎంఇఒ చిన్నవాడు పాల్గొన్నారు.


అధికారులను నిలదీస్తున్న అనధికార వ్యక్తులు

గిరిజనులకు అన్యాయం చేయొద్దు

ప్రజాశక్తి - కంచిలి

ప్రజాప్రతినిధులు రాజకీయ లబ్ధి కోసం గిరిజనులకు అన్యాయం చేయొద్దని ఆదివాసీ సంఘాల ఐక్య పోరాట సమితి ప్రతినిధులు అన్నారు. శుక్రవారం జిల్లా జెఎసి అధ్యక్షుడు ఎస్.రాంబాబు, ప్రధాన కార్యదర్శి జి.అప్పన్న, గౌరవ అధ్యక్షులు సవర జగన్నాయకులు ఆధ్వర్యంలో కంచిలిలో నిరసన తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో బెంతు ఒరియా కులస్తులు లేరని, గతంలో స్థానిక అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ నివేదికలు ఇచ్చారన్నారు. కానీ నకిలీ బెంతు ఒరియాల కోసం ఇక్కడి ప్రజాప్రతినిధులు పాటుపడుతుండడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అశోక్, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజు ఏకసభ్య కమిషన్ ఎదుట బెంతు కులస్తులకు న్యాయం చేయాలని కోరడం సరికాదన్నారు. పిరియా దంపతులు ఆదివాసీ సమస్యల పరిష్కారానికి ఎప్పుడైనా కృషి చేశారా? అని ప్రశ్నించారు. కమిషన్ సభ్యులు నిష్పక్షపాతంగా పరిశీలన చేయాలని, లేకుంటే తమ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మందస మండల ఆదివాసీ వికాస పరిషత్ కోశాధికారి ఎస్.విజయ్, సభ్యులు పూరేంద్ర సవర, చిరంజీవి, మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న ఆదివాసీ జెఎసి నాయకులు


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

అంగన్వాడీ భవన నిర్మాణంపై వివాదం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలోని కొఠారి గ్రామ అంగన్వాడీ సబ్ సెంటర్ నిర్మాణంలో ఇరు గ్రూపుల మధ్య మాటల యుద్ధంతో పనులు తాత్కాలికంగా నిలుపుదల చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని ఇరు వైపులా వాదనలు విన్నారు. కాలనీవాసుల నిర్ణయం మేరకు సబ్ సెంటర్ నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే అశోక్ ఆదేశించారు. ఇటీవల జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ మూడు సెంట్ల స్థలానికి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి శుక్రవారం విఆర్ఒ, సర్వేయర్ ఆధ్వర్యాన పునాదులు తవ్వేందుకు స్థలం వద్దకు వచ్చారు. టిడిపి మాజీ సర్పంచ్, ఎఎంసి మాజీ చైర్మన్ సాడి సహదేవరెడ్డి అభ్యంతరం తెలిపారు. ఎమ్మెల్యే అశోక్ అక్కడకు చేరుకున్నారు. రోడ్డుకు అడ్డంగా భవనం కట్టడం వల్ల పలు గ్రామాల రైతులు ఇబ్బంది పడతారని అన్నారు. గ్రామ కంఠానికి చెందిన నాలుగు సెంట్ల స్థలం ఉందని, అందులో భవనం కట్టుకుంటే మాకు అభ్యంతరం లేదని టిడిపి నాయకులు తేల్చి చెప్పారు. వైసిపి సర్పంచ్ ప్రతినిధి దుక్క ఆనంద్ ఇది ఎప్పటి నుంచో అనుకున్న స్థలమని, ఈ రోడ్డు మీదకు ఈ బిల్డింగ్ రాదని, మీరు చెప్పిన చోట భవనం కడితే అక్కడి రైతులకు ఇబ్బంది అని చెప్పారు. రెవెన్యూ, పోలీసుల సమక్షంలో సంప్రదింపులు జరిపి, ఓ కొలిక్కి వచ్చిన తరువాత నిర్మాణం చేపట్టాలని అధికారులు ఇరువురు నేతలకు సూచించారు.

ఉన్నతంగా ఆలోచించాలి

టెక్కలి: తరగతి గది నుంచి విద్యార్థి తన చదువు పూర్తయిన వెంటనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవడంలో తన ఆలోచనలు ఉన్నతంగా ఉండాలని, అప్పుడే జీవన యానంలో ఒడిదొడుకులు లేకుండా ప్రయాణం చేయవచ్చని సర్వోదయ ఎడ్యుకేషనల్ సోసైటీ నిర్వాహకులు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. ప్రణవి డిగ్రీ కళాశాల్లో డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఆహ్వాన వేడుక శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుస్తకాల్లో విజ్ఞానం మాత్రమే ఉంటుదని, సమాజం ఆనే పుస్తకంలో జీవితం ఉంటుందని అన్నారు. దాన్ని అధ్యయనం చేసిన వారు మేధావితో సమానమని ఆన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ భోగస్వామి, రాంప్రాత్రుని రామారావు, సూర్యనారాయణ, వెంకటరావు, కృష్ణారావు, సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాపాకలో గ్రామసభ

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని రాపాకలో కార్యదర్శి శాంతిస్వరూప్ ఆధ్వర్యాన పంచాయతీ గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయితీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, విద్యుద్దీపాలు, తాగునీరు, పారిశుధ్య నిర్వాహణ, రహదారుల నిర్మాణం వంటి పలు విషయాలను చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిది కొంచాడ గిరిబాబు, విఆర్ఒ బలరాం, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బస్సు

ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

లారీని బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. జాతీయ రహదారి గట్లపాడు సమీపంలో శుక్రవారం వేకువజామున బరంపురం నుంచి జైపూర్ వెళ్తున్న బస్సు డ్రైవరు నిద్ర మత్తులో ఎదురుగా వెళ్తున్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మితిన్‌గౌడ్, మున్న సాహు, ఉద్యామజద్, మోహిని బెహరా, డ్రైవరు గాయపడ్డారు. వీరిని 108లో నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హెచ్‌సి డి.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

మండలం జాతీయ రహదారి చిన్నబమ్మిడి గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబ్‌నగర్ జిల్లా ఉంగూరు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఉప్పునూరు పార్వతాలు గాయపడ్డాడు. ఈయన ద్విచక్ర వాహనంపై క్లాత్ బ్యాగులు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈయన పలాస నుంచి నరసన్నపేట వెళ్తుండగా చిన్న బమ్మిడి వద్ద వెనుక నుంచి లారీ ఢీకొంది. గాయపడిన ఆయనను 108లో నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హెచ్‌సి వైకుంఠరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామదేవత ఉత్సవాలకు విరాళం


ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాలకు 750 మహిళా సంఘాలు సేకరించిన రూ.7 లక్షలు విరాళాలను మేళతాళాలతో వెళ్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి ఆలయ కమిటీకి శుక్రవారం అందజేశారు. తొలుత మహిళా సంఘ సభ్యులు శుక్రవారం పుర వీధుల్లో ర్యాలీగా మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. చైర్‌పర్సన్‌తో కలిసి మేళ, తాళాలతో ఆలయం వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ.7 లక్షల విరాళాన్ని ఆలయ కమిటీకి అందించారు. ఏప్రిల్ 17న ప్రారంభమయ్యే సంబరాలకు మహిళా సంఘాల హంగామాతో సంబరాల శోభ సంతరించుకుంది. కార్యక్రమంలో మెప్మా మేనేజరు జానకీరావు, సిఒలు బాలరాజు, సంతోష్, ఆర్‌పిలు, మహిళా సంఘాల సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిన్ని సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తోటి వారికి సాయపడాలన్న కెల్ల కిషోర్‌కుమార్(చిన్ని) ఆశయం స్ఫూర్తిదాయకమని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. నగరంలోని కెల్లవీధిలోని ఆయన స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన పుట్టిన రోజు వేడుకల్లో ఎంపీతో పాటు మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు, లక్ష్మీదేవీలు కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. చిన్ని పుట్టినరోజు సందర్భంగా కెల్లవీధి యువత పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. న్యూబ్లడ్ బ్యాంకు సంస్థ మేనేజర్ మణికంఠ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 100 మంది యువత రక్తదానం చేశారు. మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు నిర్వహించారు. ఆర్థికంగా వెనుకబడిన 35 మంది విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను అందజేశారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న 20 మంది చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ చిన్ని తల్లిదండ్రులు కెల్ల కొండలరావు, చిట్టెమ్మలు ఎంతో ఉన్నత విలువలు కలిగిన వారని, ఆ కుటుంబం నుంచి వచ్చిన చిన్ని కూడా అదే విలువలను కలిగి ఉండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాధారపు వెంకటేష్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కొర్ను ప్రతాప్, దాసునాయుడు, తమ్మినేని సుజాత, నవీన్, గీతాశ్రీకాంత్, రోణంకి కళ్యాణ్, జలగడుగుల జగన్, సిరిపురపు హరి, యుగంధర్, బస్వా రాజేష్, నాగరాజు, జిలానీ తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరంలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, లక్ష్మీదేవి

ఎలుగు సంచారంతో భయం


సంచరిస్తున్న ఎలుగుబంటి

వజ్రపుకొత్తూరు: ఉద్దానంలో ఎలుగుబంటి సంచారంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. గత ఏడాది ఎలుగుబంటి వజ్రపుకొత్తూరులో బీభత్సం సృష్టించి ఏడుగురుని తీవ్రంగా గాయపరచగా అందులో ఇద్దరు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి శారదాపురంలో బమ్మిడి చంద్రశేఖర్‌కు చెందిన ఆవును తీవ్రంగా గాయపరిచింది. శుక్రవారం పట్టపగలు అక్కుపల్లి, బైపల్లి కొబ్బరి తోటల్లో సంచరిస్తూ స్థానికులను భయాందోళనకు గురి చేసింది. ఎలుగుబంటి సంచరిస్తున్న దృశ్యాలను యువకులు సెల్ ఫోన్‌లో బంధించారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేసాయి. ఉద్దానం పల్లెల్లో ఇళ్ల నుండి బయటకు రావడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంటి బారి నుండి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

సూర్యతేజ కళాశాల విద్యార్థి ప్రతిభ

పలాస: కాశీబుగ్గ సూర్యతేజ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న శాసనపురి మణికంఠ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానాన్ని గెలుచుకున్నాడు. విజయనగరం జిల్లా చోడవరం గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఇంటర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయిలో మూడోస్థానాన్ని గెలుచుకున్నాడు. కరస్పాండెంట్ దానేటి పద్మజీ విద్యార్థిని ఘనంగా సన్మానించారు.

బోయలను ఎస్‌టిల్లో చేరిస్తే ఉద్యమం

నందిగాం: బోయ, వాల్మీకి, వడ్డెలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని చూస్తే ఉద్యమం తప్పదని ఆదివాసీ చైతన్య వేదిక మండల అధ్యక్షులు మొగిలిపాటి జగ్గారావు అన్నారు. శుక్రవారం ఆయనొక ప్రకటనను విడుదల చేశారు. జిల్లాలో ఉన్న వారు నిజమైన బెంతు ఒరియాలు కారని, తప్పుడు ధ్రువపత్రాలతో చెలామణి అవుతున్నారని తెలిపారు. జెసి శర్మ కమిషన్ రిపోర్టును బహిర్గతం చేయాలని తెలిపారు. ఆదివాసీ, గిరిజన సంఘాలు జిఒ 52 రద్దు చేయాలని నిరసన చేస్తుంటే కనీస స్పందన లేదని పేర్కొన్నారు. తక్షణమే ఎస్‌టి జాబితాలో ఒరియా, బోయలను చేర్చే ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

తులసీరావు మృతి తీరని లోటు

కంచిలి: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతి సంస్థకు తీరని లోటని పెద్ద శ్రీరాంపురం ఎంపిటిసి మాదిన విమల రామారావు అన్నారు. శుక్రవారం గ్రామంలోని విశాఖ డెయిరీ కార్యాలయం వద్ద తులసీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్న సంస్థగా ప్రారంభించిన డెయిరీని అభివృద్ధి చేయడంతో పాటు వేలాది మంది రైతులకు చేయూత అందించారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఈశ్వరరావు, గ్రామస్తులు మార్కండేయులు, సీతారాం, భుజంగరావు, వెంకటరావు, సంజీవరావు, వల్లభరావు, చిరంజీవి, రైతులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

పలాస: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామని పిఎసిఎస్ అధ్యక్షులు పి.వెంకటరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్ల గ్రామంలో శుక్రవారం ప్రజా సంక్షేమంలో భాగంగా శివ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్ప, ఉపసర్పంచ్ ఈశ్వరరావు, ఎంపిటిసి రవణమ్మ పాల్గొన్నారు.

గుప్తాకు సత్కారం

శ్రీకాకుళం అర్బన్ : వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ గవర్నర్ పి.జి.గుప్తాను శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పవనపుత్ర వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ గవర్నర్‌గా ఇటీవల అవార్డు దక్కించుకున్న గుప్తా బాటలో నడవాలని కోరారు. వాకర్స్ ఉద్యమానికి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చిన గుప్తా సేవలను పలువురు కొనియాడారు. పవనపుత్ర వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఐకె.రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జి.ఇందిరాప్రసాద్, జోగినాయుడు, కె.మురళీ, బి.సంజీవరావు, సింహాద్రి వేణుగోపాల్ పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పులు అవసరం


డ్రోన్‌ను పరిశీలిస్తున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు రావడం ద్వారా రైతులు మరింత సులువుగా వ్యవసాయ పనులు చేసుకోగలరని, తద్వారా వ్యవసాయంపై నేటితరం దృష్టి సారిస్తుందని రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ మంత్రి కార్యాలయం ఆవరణలో వ్యవసాయ రంగంలో మరింత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందించాలనే లక్ష్యంతో సెంచూరియన్ యూనివర్సిటీ యాజమాన్యం ఆధ్వర్యంలో అశోక్ థాయిలాండ్ సహకారంతో ఏర్పాటు చేసిన నాలాడ్జ్ వాహనాన్ని శుక్రవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. యూనివర్సిటీ విద్యార్థులు తయారు చేసిన పురుగు మందులు జల్లే డ్రోన్‌ను పరిశీలించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం లాభసాటి చేయాలని సంకల్పంతో ముఖ్యమంత్రి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని చెప్పారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రిన్సిపాల్ పాల్గుణరావు, వైసిపి నాయకులు బడగల బల్లయ్య, శిష్టు గోపి, బాడ జగన్నాయకులు, గొండి మోహన్, ప్రేమ్‌కుమార్, యునివర్సిటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'యువశక్తి' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మనోహర్

ఇచ్ఛాపురం: ఈ నెల 12న రణస్థలంలో నిర్వహించే యువశక్తి బహిరంగసభ వాల్‌పోస్టర్‌ను జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో జనసేన నియోజకవర్గ సమన్వమకర్త దాసరి రాజు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాసరి రాజు మాట్లాడుతూ వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువశక్తి పేరుతో నిర్వహించే బహిరంగసభను జయప్రదం చేయాలన్నారు. ఉత్తరాంధ్ర నుంచి వలసలు, విద్య, వైద్యం, భరోసాలేని రైతాంగం, భూకబ్జాలు దందాలు, పర్యావరణ విధ్వంసం, యువత ఉపాధి, ఉత్తరాంధ్ర కళలు వంటి అంశాలుపై జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సమక్షంలో యువత ఉత్తరాంధ్రలో నెలకొన్న సమస్యలపై తమ గళాన్ని వినిపించేలా యువతను భాగస్వామ్యం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం నియోజకవర్గం జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ఈ నెల 12న యువశక్తి బహిరంగసభను జయప్రదం చేయాలని జనసేన మండల నాయకులు పైడి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం పురుషోత్తపురం, రొట్ట వలస, తదితర గ్రామాల్లో యువశక్తి పోస్టర్లను గోడలకు అతికించారు. ఆయనతో పాటు జన సైనికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


కోటబొమ్మాళి: పింఛను పంపిణీ చేస్తున్న వెంకటరావు

ప్రజాశక్తి -జి.సిగడాం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే జి.కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక ఆహ్వానితులు ఎం.వెంకటరమణ ఆధ్వర్యాన ఎమ్మెల్యే నూతన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బి.వెంకటరమణ, ఎంపిపి ఎం.సత్యవతి, జెడ్‌పిటిసి కె.రమణ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు, తహశీల్దార్ వేణుగోపాలరావు, పిఎసిఎస్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు గరుడభద్ర సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం కొత్త పింఛన్లను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనరు ఎ.దానేసు, సిహెచ్ ధనరాజ్, వై.ఆనందరావు, కూర్మారావు, స్వాతి, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతన పింఛన్లను ఎంపిపి మెరుగు రాజేశ్వరి, జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి అందించారు. అనంతరం సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఉమాసుందరి, పిఎసిఎస్ చైర్మన్ కె.జగన్నాయకులు, వైసిపి నాయకులు కోత సతీష్, నక్క భీమారావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని జియన్నవలస సచివాలయంలో నూతన పింఛన్లను ఎంపిటిసి ఎన్.రాజశేఖర్ శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదీ జనవరి, జూన్ నెలల్లో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిని ఎంపిక చేసి పెన్షన్లు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బలగ సూర్యారావు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని కొత్తపల్లిలో నూతన పింఛన్లను జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు పంపిణీ చేశారు. తొలుత జగన్ చిత్రపటానికి పాలాభిషేకంచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.రాము, వైసిపి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, పల్లెల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తాళభద్ర గ్రామంలో రూ.35 లక్షల వ్యయంతో సిసి రోడ్డు, మురికి కాలువ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అనుబంధ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. పారిశుధ్య కార్యక్రమాలకు ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కె.మాధవరావు, వైసిపి 18వ వార్డు ఇన్‌ఛార్జి మార్పు యుగంధర్, మున్సిపల్ డిఇఇ బల్ల హరి, వైసిపి నాయకులు, సచివాలయం ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాళ్లవలసలో గ్రామసభ


మాట్లాడుతున్న విజయ్

ప్రజాశక్తి -నౌపడ

సంతబొమ్మాళి మండలం తాళ్లవలస పంచాయతీలో శుక్రవారం సర్పంచ్ గున్న జానకమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, చేపట్టనున్న పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. పలు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ సమావేశాన్ని వెలుగు ఎపిఎం సూర్యనారాయణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, చిన్నతుంగాం పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, కెజి.వలస పంచాయతీ కార్యదర్శి కె.బి శ్రీను, విఆర్‌ఒ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాగ్ డే ఫండ్ సేకరణ


ఫ్లాగ్ డే ఫండ్ అందిస్తున్న విద్యార్థిని

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలోని పురుషోత్తపురం మోడల్ స్కూల్‌లో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు స్వచ్ఛందంగా ఫ్లాగ్ డే ఫండ్ రూ.4వేలను మాజీ సైనికుల సంక్షేమ సంగం జెసి దక్కత విశ్వనాథరెడ్డికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డి.శివప్రసాద్ మాట్లాడుతూ దేశ సైనికులు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అటువంటి వారిని సన్మానించుకోవడం, సైనిక సంక్షేమం కోసం సంక్షేమ నిధికి విరాళాలు ఇవ్వడం ప్రతి పౌరుని కనీస బాధ్యత అని కొనియాడారు. కార్యక్రమంలో యు.శంకరరావు, జగన్నాథరెడ్డి, తిరుపతి మహాపాత్రో, చరణ్, వైస్ ప్రిన్సిపాల్ డివి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



అనితను కలిసిన ఎంజిఆర్

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షులు వంగలపూడి అనితను పాయకరావుపేటలో టిడిపి సీనియరు నాయకులు మామిడి గోవిందరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పలు అంశాలపై ఆమెతో చర్చించారు.

- ప్రజాశక్తి, మెళియాపుట్టి

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని వెదుళ్లవలస జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఇఒ దుప్పల రామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందిస్తోందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనాన్ని రుచి చూశారు. వంటలు బాగున్నదీ లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు కావాల్సినంత ఆహారాన్ని అందజేయాలని మధ్యాహ్న భోజన కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు సర్పంచ్ చిలకలపల్లి సురేష్ , పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు వితరణ


విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను అందిస్తున్న వరాహనరసింహులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని కొర్లకోట గ్రామంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం పొన్నాడ అప్పలనరసమ్మ-చిన్నవాడు సేవా సంస్థ అధ్యక్షులు, రిటైర్డ్ టీచర్ వరాహ నరసింహులు స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సేవా సంస్థ ద్వారా 130 మంది విద్యార్థులకు పళ్లాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. విద్యార్థులు విద్యను చక్కగా అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సనపల ఢిల్లేశ్వరరావు, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, సేవా సంస్థ కార్యదర్శి కర్నేన జనార్ధన్‌రావు, మోహనరావు, ధనుంజయ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం, తదితరులు పాల్గొన్నారు.